# పండువంటి కాపురం

కప్పగంతుల సత్యనారాయణ

'నీకు ఉరిశిక్షవేశాను' అని జడ్జిగారు రంగయ్యకేసి తిరిగి చెప్పారు. రంగయ్య తలగ్రాపాడు కళ్లూ, నొసలు భావశూన్యంగా వున్నాయి. 'ఇవ్వాళికి సరిగ్గా యేడో నాడు నీమరణం' అని వుద్యోగి వొకడు రంగయ్యని కోర్టులోంచి తీసికెళ్లిపోయాడు. ఇదంతా నేను కోర్టు వరండాలో ఉండి చూస్తూనే వున్నాను. రంగయ్య మీద కేసు యేమిటో, అతనికి శిక్ష యెందుకో నాకు తెలియదు. ఎవరిని అడిగినా 'యేదో ఖూనీ కేసులో ముద్దాయి' అన్న మాటే కాని వివరంగా చెప్పినవాళ్ళు యెవరూ లేరు. కాని రంగయ్యని నేను బాగా యెరుగుదును. మా నాన్నగారు కాకినాడలో డిప్టీకలెక్టరు చేసినపుడు నేనూ రంగయ్యా మూడో ఫారం దాకా చదివాము. తరువాత రంగయ్య చదువు చాలించుకొని వాళ్లవూరు వెళ్లిపోయినాడు. కాని అప్పుడప్పుడు కాకినాడలో కనిపించి నప్పుడల్లా పలకరిస్తూ యుండేవాడిని. రోడ్డుమీద నిలబడి కొంచెంసేపు మాట్లాడి వెళ్లిపోయేవాడు. మానాన్న గారికి రాజమండ్రీ బదిలీ అయినాక ఆవూళ్లోకూడా కనిపించేవాడు.

నాలుగేళ్ళయిందంటే మే మొకళ్ళ మొకళ్ళం చూసుకోక; కాని అతను ఖూనీ చేశాడంటే నాకు ఆశ్చర్యమేసింది. పిల్లిలా వుండేవాడు క్లాసులో. సంగతి తెలుసుకుందామని అభిలాష గలిగింది నాకు.

మర్నాడు కలెక్టరుగారి దగ్గరనుంచి ఆజ్ఞాపత్రం తీసికొని రంగయ్యని చూడటానికని జైలుకు వెళ్లి రంగయ్యని పలుకరించాను. ఏడ్చాడు. 'అసలు సంగతేమిటి' అన్నాను.

'అంతా చెపుతాను. చెప్పక దాచటానికి నా మనస్సుకి నేను చేసినపని న్యాయమే ననిపిస్తోంది. న్యాయశాస్త్రానికిమాత్రం నేను దోషినే. ఇంక ఆరు రోజుల్లో నాప్రాణాలు యెగిరిపోతాయి. నాతోటి యీపాపాన్ని మోసుకొని పోవడమెందుకూ. ఇక్కడే వదిలేస్తాను. చెప్పక యేంచెయ్యను?' అని కూజాలో మంచినీళ్లు కాసిని త్రాగిమొదలుపెట్టాడు.

'మనమిద్దరమూ కలసి చదివి యిది పదమూడవ యేడు. యీ పదమూడు సంవత్సరాలూ యెలా జరిగి పోయాయో, అంతా నాకళ్ళకి కట్టినట్టు కనిపిస్తోంది. ఎవరి నుదుట్న ఎలా రాసివుందో అలా జరిగి తీర్తుందికదా!—నేను చదువు మానిన రెండేళ్లకే పెళ్లిచేశారు. ఆ సంవత్సరమే మాతల్లి పరమపదించింది. కోడలు కాలుపెట్టి అత్తగార్ని సాగనంపింది అని మా బంధువులంతా నాభార్యని అంటూ వుండేవారు. చిన్నప్పటినుంచీ తోటలూ, ఆశ్రమాలూ అంటే యెంతో యిష్టపడేవాడిని కదా. మా తల్లి పరమపదించిన సంవత్సరమే మా తోటలో ఒక ఆశ్రమం కట్టించాను. పత్రికలు తెప్పించి, అక్కడ కూచుని చదువుకుంటూ, తోటలకు పొలాలకు స్వయంగా వెళ్ళి జీతగాళ్లకి పనులు చెప్పి చేయించుకుంటూ కాలంగడిపేవాడిని. ఆరోజులలో నేననుభవించిన సంతోషమూ, స్వేచ్ఛా, జీవిత నిరాడంబరమూ తలుచుకుంటే 'పరిపూర్ణ సుఖంబు లధిక బాధల కొరకే' అన్నమాట జ్ఞాపకము వస్తూవుంటుంది. మా అమ్మ చనిపోయిన రెండుమూడు నెలలకీ మాచెల్లె అత్తారింటికి వెళ్లిపోయింది. ఆ తరువాత మానాయనా, నేనూ వండుకొని తినేవాళ్ళం. ఎవరికి వీలైనప్పుడు వాళ్ళువండేవాళ్ళము. వంటంతా అయి భోజనానికి కూర్చునే టప్పటికి మా నాయనకి కళ్ళవెంబడి నీళ్లు కారేవి. నాహృదయము నీరైపోయేది మాతల్లిని తలుచుకొని—

'యీకాలంలోనే నాభార్య రజస్వల అయిందని ఉత్తరం మీద ఉత్తరం—నాలుగు ఉత్తరాలు వచ్చాయి. ఇంట్లో ఆడదిక్కు లేకపోవడంచేతా, అన్ని పనులు మేము మగవాళ్లంచేసుకుంటూవుండటంచేతా, మానాయనగారికష్టము చూసి, ఆయన యిష్టప్రకారం నిషేకం చేసుకొన్నాను. నాభార్యా ఆమెతల్లి వచ్చారు మాయింటికి. వంటావార్పూ నేర్పుతూ మా అత్తగారు నాభార్యతోటి నాలుగు నెలలు మాయింట్లోనే వుంది, తరువాత ఆమెకూడా వెళ్ళిపోయింది.

'నాభార్యా, నేనూ చాలా అనుకూలంగా వుండేవాళ్ళం. ఇరుగు పొరుగువారంతా, అనుకూల దాంపత్యం అంటే మమ్మల్ని వ్రేలుపెట్టి చూపించే

వాళ్లు. చీటికీ మాటికీ పొరుగిళ్లకి పోవడం, వీళ్ల వాళ్ల పోట్లాటలు కుతూహలంతో వినడం, తాను పోట్లాడటం మొదలైన దుర్గుణాలు యేమీ నా భార్యదగ్గర లేవు. అది నాతో కాపురంచేసిన యీ తొమ్మిది సంవత్సరాల్లోనూ, పొరుగింట ఆవగింజ యేనా బదులు తేవడం నేను చూడలేదు. అలాంటి భార్యతో, అప్పుసొప్పులు లేకుండా, యేదో తిన డానికీ కట్టడానికీ సరిపోయే ఆదాయంతోనూ, ఎంత సౌఖ్యప్రదమయిన జీవితం గడుపవచ్చునో ఆలోచించుకో. మాతండ్రిని మాత్రం నా భార్య కాపురమునకు వచ్చినది మొదలు, యేపనిని ముట్టుకోన నిచ్చినవాడను గాను. అయనకూడా, భార్యాభర్తలమగు మమ్ముల చూచి ఆనందించుతూ, స్వకీయములగు మనో బాధలన్నియు మరచిపోయి, భగవన్నామ స్మరణము చేసుకొంటూ తక్కిన తన కాలము గడిపివైచినాడు. మాతండ్రి చనిపోయి యిది మూడవయేడు.'

ఇంతవరకు చెప్పి రంగయ్య కొంచెము సేపాగి, రెండు కన్నీటి చుక్కలను విడిచి, నాచే నాదరింప బడి మరల మొదలుపెట్టినాడు.

'అంతే, నాతండ్రి చనిపోయినాడు. నాసుఖము, నా ఆనందము, నా స్వేచ్ఛ, నా మనోస్థైర్యము నాశనమై పోయినవి. నాతండ్రి చనిపోయిన కొలది దినములవరకును నాసతి నన్నోదార్చెడిది. ప్రపంచమున నా కామెకన్న నింక నాప్తులెవరున్నారు? ఆమె మాటల కూరడిల్లెడివాడను. ఆమె కూడా నాకెంతో యిష్టప్రదముగ ప్రవర్తించేది. రోజులన్నియు నొకతీరున నుండవుకదా. నా దురదృష్టము మొలకలెత్తినది.

'మావూరు పల్లెటూరును కాదు, పట్ణవాసమును కాదు, అయినా ధనికులుండుటచేత, పోలీసు స్టేషను, రిజిస్ట్రారుఆఫీసు వున్నాయి. తరువాత ఆసుపత్రి కూడా అవసరమని మాగ్రామస్థులకు తోచింది. ఎల్. ఎం. పి. ప్యాసైన ఒక యువకుని, గ్రామస్థులందరును చందాలు వేసుకొని, పంచాయితీ కోర్టువారి మేనేజిమెంటు క్రింద, నెలకు నలభైయైదురూపాయలు యిచ్చేటట్టుఖరారు చేసికొని పిలిపించారు.

'ఆ డాక్టరుకు కొత్తలో యెక్కడా వసతి దొరకలేదు. నాయింట్లో బస యిచ్చాను. అంటే పామును తెచ్చి ప్రక్కలో పెట్టుకున్నానన్నమాట. మాయింట్లో అతను వున్నది వారం రోజులు. తరువాత వేరే యిల్లు చూసుకొని ప్రవేశించాడు. మందులు అన్నీ తెప్పించి ఆసుపత్రి ఒకటి తయారు చేశాడు. మావూళ్లో క్రొత్తలో వేళంవెర్రి కిం రోజుకి రెండువందలమంది కూడా వచ్చేవాళ్లు ఆసుపత్రికి. కొంతమంది డాక్టరును చూడటానికే వచేవారు. చెన్నపట్ణంనించి రావడంచేత, నవనాగరికత అంతా బాగా పట్టి చూసినవాడు కావడంచేత, ప్రకృతంగా సుందరుడు కావడంచేత, పురుషులే అతను మాట్లాడితే చాలుననుకొనే వాళ్లు, అతను సాయంత్రమూ, ఉదయమూ, ఆసుపత్రికి పోయేటప్పుడూ వచ్చేటప్పుడూ వూళ్లోవున్న స్త్రీలలో చాలామంది తలుపుచాటున నుండి తొంగి తొంగి చూచేవారు. గ్రామంలో పురుషులాబాలగోపాలమునూ అతనికి నమస్కారం చేస్తూ, అతనికి విరామమన్నమాట లేకుండా, అతనితో సంతతము లోకాభిరామాయణము సాగించేవారు.

'డాక్టరుకూడ తన హావభావములను మరిమరి వృద్ధిచేస్తూ హోదా చెలాయించే వాడు. కుర్రవాడగుటచేత, చిన్నతనమునుండీ అదుపు ఆజ్ఞలు లేకుండ పెరిగి యుండుటచేతను అతనిస్వభావము మాత్రము మంచిదిగాదు. పైగా--అవివాహితుడు--

'డాక్టరు మాయింట నడుగుబెట్టిన వేళ యెట్టిదో కాని నాకాపురము ధ్వంసమైనది.—పండువంటి కాపురం—నాభార్య యెప్పుడూ యేదో పరధ్యానముగ నుండెడిది. ఏపని చెప్పినను, ఏమాట యడిగినను, అసంపూర్తియే. కాని మొదట నాకేమియు శంకపుట్టలేదు. ఎట్లు పుట్టగలదు? పదకొండున్నర సంవత్సరములు, ఊరివారందరిచేతను 'ఉత్తమసతి' అని మెప్పుపొందిన నాభార్యను నేనెట్లు శంకింతును? డాక్టరు నాయిల్లు వదలిన తరువాత నా భార్య నాయందు మునుపటికన్న యెక్కువ ప్రేమ జూపెడిది. అదంతా మాయ అని తరువాత తెలిసిందినాకు. కాని నాకు అప్పుడు అలాంటి అనుమానం కలలోనైనా కలుగలేదు. నాకొక్కడికే కాదు అది మావూళ్లో చాలామందికి అలా జరిగింది. కాని వారిపీడ అంతా నామీదుగా పోయింది. నిజమంతా సిగ్గు విడిచి, మరణింప బోవుచున్న నేను, చెప్పడానికి యింక యేమీ? కనుక యీ నాలుకతో నీకు చెప్పే

స్తున్నాను. మావూళ్లో వున్న స్త్రీ లందరికన్నా నా భార్యయే చక్కనిది. అందుచేత ఆడాక్టరు ఆమెను ప్రేమించుటలోనూ, నాగరికతా మూర్తియై విలాస స్వభావుడైన ఆ డాక్టరును ఆమె ప్రేమించుటలోను, ప్రకృతి విరుద్ధమేమీ లేదు కాని—అధికానురాగము నాపుచు నా రెండవ ప్రాణముగా నెంచి నే నాదరించు నాభార్య నా ప్రేమను చిరకాలమునుంచి నెలకొనియున్న తన హృదయమునుండి తొలగించి, నాలుగు దినముల ముచ్చటకై తన్ను మోసగించుచున్న ఆడాక్టరును ప్రేమించుట నాకు భరింపరాని దయ్యెను. అప్పుడు నేను కనుక్కోలేదు కాని నాభార్య చూపిన అపూర్వానురాగమునకు కారణమిప్పుడు తెలిసినది. తన దొంగవేషము బయల్పడకుండుటకై నా మీద కృత్రిమ ప్రేమను వెల్లివిరియించింది. ఆమె మొదట నిట్టి మోసమును యెరుగదు గాని పరిస్థితులు నేర్పినవి ఆమెకు. ఏమైతేనేమి నాభార్య దుర్మార్గమును త్రొక్కినది. రోజులు గడిచిపోయినాయి. దాని మర్మ ప్రవృత్తిని నేను కనుక్కోలేదు. ఇంతమట్టుకు వొక్కరోజుకూడా ఆడాక్టరు దగ్గరకు నేను మందుకోసం పోలేదు. బజారులో అప్పుడప్పుడు యెదురుపడేవాళ్లం. అతనే నన్ను పలకరించేవాడు. స్నేహితులవలె మాట్లాడే వాళ్ళం. అప్పటికి మాకు మనస్పర్థలు లేవుగా బాగానే మాట్లాడేవాడు. మర్యాద వొలికిపోయేది మాటల్లో. 3

'రోజులు గడిచిన కొద్దీ వ్యవహారం పాతబడింది. ఎన్నాళ్ళు దాగుతుందీ. ఊరంతా పాక్కిపోయింది. బజారులో నేను పోతూవుంటే నన్ను పూర్వము పలుకరించి మర్యాదగా మాట్లాడేవాళ్లంతా, తృణీకరించినట్టుగానూ, నావెనుక గుసగుస లాడినట్లుగాను అనిపించేది. నాకదంతా అప్పుడర్థము కాలేదు. కొన్నాళ్ళకి ఆకాశరామన్న ఉత్తరం ఒకటి వచ్చి పడింది. అది విప్పి చూశాను. నాభార్య నడవడిక చాలా నీచంగా వుందనీ, ఆమెను వొకకంట కనిపెట్టమనీ, డాక్టరుకూ ఆమెకూ రాకపోకలు జరుగుతున్నాయని రాశివుంది అందులో. అది నాచేశాను. మనస్సు బాగా లేనప్పుడు మొహంలో కళ యెట్లా వుంటుంది. అన్ని విషయాల్లోనూ ముభావంగా వుండటమూ, ధుమధుమ లాడటమూ నాభార్య కనిపెట్టే వుంటుంది. కాని నేనామెను అడగలేదు. "వినదగు నెవ్వరు చెప్పిన వినంతనె వేగపడక వివరింపదగున్"

అని పూర్తిగా నిజం తెలిస్తేనే కాని ఎలాగ దండించడం? మనస్సు వోపిక పట్టాను కాని నడవడికలో అనుమానం కలుగచేయకుండా వుండలేక పోయినాను. పండువంటి కాపురం ధ్వంసమైంది. నేనన్నమాటకి నాభార్యా, నాభార్యా అన్నమాటకి నేనూ ఎదురుచెప్పడం, కలహమూ ఆరంభమయాయి. కొన్ని విషయాలలో యిరుగు పొరుగు వాళ్లు కలగజేసికొని మాకు తీర్పు చెప్పటము కూడా సంభవించింది. సంసారమంట్లే ఎవడికి బట్టింది అన్నట్లు వుండేవాళ్ళము యిద్దరమూను. రెండు మూడుసార్లు—ఎన్నడూ లేనిది—నాభార్యమీద నేను చెయ్యి కలగజేసికోవడమూ, అది బావిలో పడతానని పరుగెత్తడమూ కూడా జరిగింది. ఇంతా జరిగేలోపల మరిరెండుత్తరాలు వచ్చాయి రోజురోజూ వాళ్ళనడత హద్దు మీరిపోతోందని.

'నిజం కనుక్కుందామని మనస్సు తహతహలాడుతోంది. ఒకరోజు మామూలుగా పొలంవెళ్ళి రోజూకంటే రెండుమూడు గంటలు ముందు వచ్చాను. మాయింటి గుమ్మం మెట్లు దిగుతూ డాక్టరు కనపడ్డాడు. నావళ్ళు భగ్గుమని మండింది. నోటమాట రాలేదు. అతను చిరునవ్వు నవ్వుతూ—'మీయింట్లో జ్వరంగావుందని కబురంపితే వచ్చాను.' మందుపంపుతాను—అన్నాడు. అతని నవ్వు నాకు శూలం గ్రుచ్చినట్లయింది. అక్కర్లేదు అన్నాను. 'ఏమి?' అన్నాడు. మీకనవసరమన్నాను. కిక్కురుమనకుండా వెళ్లిపోయాడు. వాకిట్లో జరిగిన సంభాషణ అంతా యింట్లోంచి నాభార్య వింటూనే వుంది. మంచంమీద పడుకుని ముసుగెట్టుకుంది. దగ్గరగా వేసున్న తలుపు త్రోసుకొని లోపలికిపోయి—ఆవెధవ మనింటికి యెందుకొచ్చాడు—అన్నాను.

—'ఏ వెధవ?'—అంది.

నీ.........ఆడాక్టరు వెధవ.

"ఏంమాటలు! యిదా మీ అనుమానం?"

'ఛీ! దొంగవేషాలువేసి నన్ను మోసం చేస్తున్నావు. ఛా! మీ పుట్టింటికి—లేకపోతే ఆవెధవయింటికి.

"అయ్యో! అయ్యో! యేమిటది!"

'నాభార్య పెదిమలు వణకుట, శరీరము ముచ్చెమటలు పోయుట, వొళ్ళంతా నిప్పులాగ వేడియగుట చూశాను. అది జ్వరంకాదు—రహస్యభంగమైందనే భయం.

నాకళ్ళతోటి చూసినదానికి యింకా అనుమానం రేముంది అన్నాను.

“జ్వరం వచ్చింది చూశిపొమ్మని కబురంపాను. అంతే” అంది.

‘అవును పెదబారులు త్రొక్కేదానికి అబద్ధములు వద్దా? చూశిపొమ్మని కబురంపావా? అంది అంతా పనికిరాదు రేపు ప్రొద్దున మీ పుట్టింటికి పో.

‘ఆమె మాట్లాడలేదు. నేను మాట్లాడలేదు. ఆ పూట అన్నం నేనే వండాను. ఆమెని తినమన్నాను నేను తిన్నాక. తిన్నంది. నీకర్మమన్నాను. మర్నాడుఉదయం మామూలుగాలేచి వంటవండింది.

‘రెండురోజులు గడిచాయి. మామూలుగా పొలం పోయాను. మనస్సు ఊరుకోక మళ్ళీ యింటికివచ్చాను చూద్దామని. దొడ్డిగోడ దూకి యింట్లోకి పోయాను. ఏంజెప్పను—ఆవెధవతో... .........నా అర్ధాంగి, నేను న్యాయముగా వివాహమాడిన భార్య—కూచుని నవ్వుతూ మాట్లాడుతూ వుంది. నాశరీరములోని రక్తము అతి శీఘ్రముగా ప్రవహించింది. నరములన్నీ ఒక్కసారి కంపించినాయి, గొడ్డలి తీసుకొని వళ్ళు తెలియ ఆవేశముతో యిద్దరి తలమీదా చెరో పెట్టూ పెట్టాను. నేను హఠాత్తుగా రావడం చూశే ఆశ్చర్యపోయినవాళ్ళు నోట మాటలేక పడి పోయారు. రక్తం చిమ్మింది. నాకళ్ళు గిర్రునతిరిగా యి. గొడ్డలి యెత్తి కొట్టుకుంటూన్న తలలమీ మళ్ళీ కొట్టాను. వాళ్ళప్రాణాలుపోయాయి. గొడ్డ అక్కడ పారేశి తలుపుతెరుచుకొని వీధిలోపడ్డాన రక్తపు గుడ్డలుచూసి పోలీసులు పట్టుకున్నారు. తరు వాత కథ నీవు ఆలోచించుకో’ అని చెప్పాడు.

అతని కళ్ళవెంబడి నీళ్లు కారాయి. నాకళ్ళని కూడా నీరు క్రమ్మింది. కళ్లు తుడుచుకొని “వెడ తాను రంగయ్యా” అన్నాను.

“వెళ్లు. ఇంక యీ ప్రపంచములో మనము కలుసుకోనము” అన్నాడు.

నామనసు నీరైంది. విడువలేక విడువలేక అతనిని విడిచివెళ్లాను.

రంగయ్యను తరువాత ఉరిదీసిన సంగతి తెలిసింది.

## సంపాదకుని ముచ్చటలు

చిత్రగుప్త పక్షపత్రిక...

చిత్రగుప్తను పక్షపత్రికగా మార్చవలెనని అనేకమంది వ్రాస్తున్నారు. ఆంధ్రుల అభిలాష ఉత్సాహము అలా ఉన్నప్పుడు తప్పక అలానే అవుతుంది. చిత్రగుప్తకు యిప్పటికప్పుడే చాలా ఆదరణమును చూపారు ఆంధ్ర సోదరసోదరీమణులు; ఇంకా కొంత ప్రోత్సాహము వచ్చినదనగనే చిత్రగుప్త పక్షపత్రిక కాగలదు. అందుకు కొలది మాసముల వ్యవధి యియ్యాలి. అనంతరము మీసహాయంతో పత్రికను పక్షపత్రికగా చేస్తాం.

జనవరిసంచిక—

జనవరిసంచికలో ఉన్నట్టుగా కథలు యెక్కువగా ఉండాలన్న అభిప్రాయాన్ని చాలామంది వెలిబుచ్చారు. ఇంకముందు యీపద్ధతినే అనుసరింప దలచాను. కాని కథలువ్రాసేవారు మాత్రం, యేకథవ్రాసినా క్లుప్తముగా వుండేలాగు రాజకీయముగనో, సాంఘికముగనో ఒక సంస్కారమును, ఒకఅభివృద్ధిని సూచించేవిధముగా ఉండేటట్లు చూడాలి. అంటే కేవలం నీతినిచ్చేలాగు ఉండాలనిఅనను. హాస్యంతో కూడుకొన్నా ఒకవిషయం ఆధారంగా కలిగియుండాలి.